క్లుప్తంగా

శ్రీరామ్‌కు ఆర్థిక సాయం



కొమరాడలో శ్రీరామ్‌కు సాయం పంపిణీ చేస్తున్న నాయకులు

మామిడికుదురు: కొమరాడలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కొర్లపాటి శ్రీరామ్‌కు స్థానికులు రూ.20 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం పంపిణీ చేశారు. శ్రీరామ్ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని పలువురు పేర్కొన్నారు. సాయం పంపిణీ చేసిన వారిలో కడలి కృష్ణమోహన్, మామిడిశెట్టి రామకృష్ణ, కడలి రమేష్, గెద్దం గణపతి, యెరుబండి దుర్గారావు, కేతా గంగాధరరావు, కడలి లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

రైతులకు నచ్చిన చోట ధాన్యం అమ్ముకోవచ్చు



కె.పెదపూడిలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ విజయ్‌కుమార్

అంబాజీపేట: రైతులు పండించిన ధాన్యాన్ని వారికి నచ్చిన మిల్లుల వద్ద అమ్ముకోవచ్చని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్ కుమార్ అన్నారు. పుల్లేటికుర్రు, కె.పెదపూడిలో సర్పంచ్ జల్లి బాలరాజు అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ, పౌరసరఫరాల శాఖ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోగా బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఏఈఓ పి.జాబేజ్, వీహెచ్ఏ మణికుమారి, రైతులు వాడ్రేవు శ్రీరామచంద్రమూర్తి, బోణం నాని, తిరుమనాథం హనుమంతరావు, నెల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ఒత్తిడి వద్దు



సుమిత్ రామారావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ డిప్యూటీ స్పీకర్ తదితరులు

రాజోలు: విద్యార్థులపై ఒత్తిడి చదువులకు దూరం చేయాలని మాజీ డిప్యూటీ స్పీకర్ ఏవీ సూర్యనారాయణరాజు అన్నారు. బుధవారం రాజోలు సెంటర్‌లో యాలంగి ట్రస్ట్ ఆధ్వర్యంలో న్యాయవాది యాలంగి రమేష్ తనయుడు యాలంగి సుమిత్‌రామారావు 25వ జయంతి నిర్వహించారు. సుమిత్ రామారావు ఒక ప్రైవేటు విద్యాసంస్థ నిర్వాహకుల ఒత్తిళ్లకు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. కుమారుడి జ్ఞాపకార్థం తండ్రి రమేష్ పలు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ ఏవీ సూర్యనారాయణరాజు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ, రిటైర్డ్ ప్రిన్సిపాల్ గంజి అనంతం, న్యాయవాదులు ముషిణి రామకృష్ణ, నీతిపూడి సత్యనారాయణ, గంటి రవికుమార్ తదితరులు సుమిత్ రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాత శ్రీనివాసరావు

ఆలమూరు: స్థానిక బాలుర సమీకృత విద్యార్థి వసతి గృహం (హాస్టల్)లో బుధవారం విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ జరిగింది. రాష్ట్ర వెటర్నరీ నాన్ గ్రాడ్యుయేట్స్ ఉద్యోగుల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, పినపళ్ల పశువైద్యాధికారి, డాక్టర్ ఈదల శ్రీనివాసరావు ఈ దుప్పట్లను అందజేశారు. ఆయన ద్వితీయ కుమార్తె గాయత్రీ వివేక్ అమెరికాలోని అట్లాంటాలో వృత్తి రీత్యా అమెరికాలోని అట్లాంటాలో నివాసముంటున్న తమ ద్వితీయ కుమార్తె గాయత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ దుప్పట్లను పంపిణీ చేసినట్లు దాత శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం బాలుర వసతి గృహం సమీపాన విద్యార్థుల సమక్షంలో కేక్‌ను కట్ చేసి గాయత్రి జన్మదిన వేడుకలను జరుపుకొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

సఖినేటిపల్లి: సఖినేటిపల్లి, సఖినేటిపల్లిలంక గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు వరిసాగు రైతులతో అధికారులు సమావేశాలు నిర్వహించారు. తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు పొందే విధానాల గురించి ఏవో పీవీ నరసింహారావు రైతులకు తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, వెటర్నరీ, వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆనంద కాంతుల దీపావళి

- నేడే ఇంటింటా దీపాల పండుగ
- డివిజన్లో 4 బాణసంచా తయారీ కేంద్రాలు, 6 హోల్‌సేల్, 130 రిటైల్ షాపులు



కొత్తపేట కాలేజ్ ప్రాంగణంలో రిటైల్ బాణసంచా షాపుల సముదాయం

కొత్తపేట: బాలలు, యువతీ, యువకులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే దీపావళి పండగ వచ్చేసింది. హిందువుల ఇంట దీపావళి రోజున సాయంత్రం లక్ష్మీదేవి పూజ నిర్వహిస్తారు. చీకటి పడుతుందనగానే ఇంటి గుమ్మాలకు ఇరువైపులా, ప్రహరీలు, భవనాల పిట్టగోడలపై దీపాలు వెలిగిస్తారు. అనంతరం ప్రధాన ఘట్టమైన బాణసంచా కాల్పులు ప్రారంభిస్తారు. ఈ పండగను పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి కుటుంబం తమ ఆర్థిక స్తోమతకు అనుగుణంగా బాణసంచా కొనుగోలు చేసి కాల్చడం ద్వారా పండగ జరుపుకొంటారు. బాణసంచా దుకాణాలు జనావాసాల మధ్య, రోడ్ల పక్కన, ఎక్కడపడితే అక్కడ బాణాసంచా విక్రయాలు సాగించకుండా అన్ని జాగ్రత్తల నడుమ నివాసాలకు దూరంగా, షాపులన్నీ ఒకే చోట కళాశాలల గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేశారు. కొత్తపేట రెవెన్యూ డివిజన్లో 4 తయారీ కేంద్రాలు, 6 హోల్‌సేల్ షాపులు, 130 తాత్కాలిక లైసెన్స్ (రిటైల్) షాపులు వున్నాయి. ఆ విధంగా కొత్తపేట మండలంలో 4 తయారీ కేంద్రాలు, 4 హోల్‌సేల్ షాపులు, 24 రిటైల్ షాపులున్నాయి. రావులపాలెం మండలం 2 హోల్‌సేల్, 38 రిటైల్ షాపులున్నాయి. ఆత్రేయపురం మండలంలో 21, ఆలమూరు మండలంలో 13తో పాటు అయినవిల్లి, అంబాజీపేట, పి.గన్నవరం మండలాల్లో సుమారు 34 షాపులు ఉన్నాయి. హోల్‌సేల్ షాపులు గత 20 రోజుల నుంచి విక్రయాలు సాగిస్తుండగా రిటైల్ షాపుల్లో విక్రయాలకు మూడు రోజులు అనుమతి ఇచ్చారు. దాంతో మంగళవారం కొందరు, బుధవారం కొందరు తమకు నిర్దేశించిన ప్రదేశాల్లో షాపులు ఏర్పాట్లు చేసుకుని విక్రయాలు ప్రారంభించారు.

అధికారుల తనిఖీలు

దీపావళి బాణసంచా హోల్‌సేల్, రిటైల్ షాపుల వద్ద నియమ, నిబంధనలు విధిగా పాటించాలని ఆర్డీవో పి.శ్రీకర్, డీఎస్పీ వై.గోవిందరావు, రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ సూచించారు. ఆ మేరకు డివిజన్, మండల స్థాయి రెవెన్యూచ పోలీస్, అగ్నిమాపక శాఖల అధికారులతో కలసి పలు హోల్‌సేల్, తయారీ కేంద్రాలు తనిఖీ చేశారు.

జాగ్రత్తలు పాటించాలి

దీపావళి పర్వదినం సందర్భంగా బాణసంచా క్రయ, విక్రయదారులు నియమ నిబంధనలు విధిగా పాటించేలా తగు చర్యలు తీసుకున్నాం. బాణసంచా కాల్చేవారు జాగ్రత్తలు పాటించాలి. దీపావళి దీపాల వలన గాని, బాణసంచా కాల్చేటప్పుడు గాని ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే వెంటనే కొత్తపేట అగ్నిమాపక కేంద్రానికి 08855 243299 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించండి.

– పి.శ్రీనివాస్, అగ్నిమాపక అధికారి, కొత్తపేట

దీపావళికి ప్రమిదలే కళ



అంబాజీపేట మార్కెట్‌లో ఆకట్టుకుంటున్న వివిధ రకాల ప్రమిదలు



వివిధ రకాల ఆకృతులతో తయారైన ప్రమిదలు

ఆత్రేయపురం: దీపావళి పండగ వచ్చిందంటే అందరూ ఉత్సాహంతో ఉంటారు. ఈ పండగకు ప్రమిదలతో ఇంటి ముందు దీపాలు పెట్టుకోవడం అది కాంతిని వెదజల్లుతూ చీకటి పారదోలుతూ పండగకే కళ తెస్తాయి. రాత్రయితే ఏ ఇంట చూసిన ప్రమిదల వెలుగులో ఆ ఇళ్లు కళకళలాడుతూ కాంతులు వెదజల్లుతూ శోభను తెస్తాయి. అటువంటి శోభను తెచ్చే ప్రమిదలు ఆత్రేయపురం మండలంలోని లొల్ల, ర్యాలి, ఆత్రేయపురం తదితర గ్రామాల్లో తయారు చేసి అమ్ముతున్నారు. డజను ప్రమిదల ధర రూ.40 నుంచి రూ.50 వరకు పలుకుతోంది. అయితే ప్రతి ఇంటా కాంతులను ప్రసరింప జేస్తున్న వాటిని తయారు చేసే కార్మికుల జీవితాలు మాత్రం వెలుగును నింపలేకపోతున్నాయి. ఇటీవల భారీగా వర్షాలు కురవడంతో తయారు చేసిన ప్రమిదల అమ్మకాలు సాగడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. ఈ ఏడాదంతా తమ జీవితాల్లో వెలుగులు నిండాలని ఆశిస్తూ ప్రతి కుటుంబం దీపావళికి ఇంటి ముందు దీపాలు పెడతారు. కాలక్రమంలో ప్రమిదల స్థానాన్ని రకరకాల డిజైన్లలో తయారు చేస్తున్నారు.

ఆకట్టుకుంటున్న ఆకృతులు

అంబాజీపేట: చీకటిని పారదోలి.. జీవితంలో కొత్త వెలుగు ప్రసరించే దీపావళి నాడు ప్రతి ఇంటా ప్రమిదల్లో దీపాలు వెలిగించడం ఆనవాయితీగా వస్తోంది. ఒకప్పుడు మట్టితో తయారు చేసిన దీపపు కుందులు, ప్రమిదలను వినియోగించేవారు. రానురానూ మట్టితో పాటు పింగాణి వంటి దీపపు కుందులు, ప్రమిదలు సైతం మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. విభిన్న ఆకృతులు.. చిత్రవిచిత్ర రూపాల్లో ఉన్న ప్రమిదలు కొనుగోలుదారులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. తులసికోట, కొబ్బరికాయలో దీపం, దీపాలు పట్టుకున్న మహిళలు, కార్తికమాసంలో ధ్వజస్తంభానికి తగిలించే ఆకాశదీపం ఆకృతులు ఆకట్టుకుంటున్నాయి. నాలుగు, ఐదు ముఖాల పింగాణీ దీపపు ప్రమిదలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. పాతకాలం నాటి ప్రమిదలు రకాన్ని బట్టి రూ.5 నుంచి రూ.15 వరకు ఉండగా, ఈ పింగాణీ ప్రమిదులు ఒక్కొక్కటీ రూ.25 నుంచి రూ.40 వరకు ధర పలుకుతుంది.

నిబంధనలు పాటించాల్సిందే

అంబాజీపేట: దీపావళి బాణసంచా దుకాణాల వద్ద తప్పనిసరిగా నిబంధనలు పాటించాల్సిందేనని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజులు హెచ్చరించారు. అంబాజీపేట మండలంలో స్థానిక జెడ్పీ హైస్కూల్‌తో పాటు ముక్కామల, పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూళ్లలో తాత్కాలిక లైసెన్సులు పొందిన బాణసంచా దుకాణాలను తహసీల్దార్, సీఐలతో పాటు ఎస్సై కె.చిరంజీవి బుధవారం తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ లైసెన్స్‌లోని నిబంధనలను విధిగా పాటించాలన్నారు. ప్రతి దుకాణం వద్ద డ్రమ్ములతో నీటిని నిల్వ ఉంచుట, బస్తాలతో ఇసుకను సిద్ధం చేసుకోవడం, నో స్మోకింగ్ బోర్డులు వేలాడదీయడం వంటి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. సొంతంగా ఎటువంటి మందుగుండు సామగ్రి తయారు చేయరాదని సూచించారు. పరిమితికి మించి సామగ్రి ఉండరాదన్నారు. ఏ మాత్రం నిబంధనలు అతిక్రమించినా వెంటనే మూయించేస్తామని హెచ్చరించారు. ఎటువంటి ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని దుకాణదారులను హెచ్చరించారు.

కౌలు రైతు సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి, నీలకంఠేశ్వరస్వామి, రాఘవేంద్రస్వామి దేవస్థానం కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు సాధనకై ఉద్యమం చేపట్టాలని సీపీఐ రాజోలు నియోజకవర్గ కమిటీ పిలుపునిచ్చింది. బుధవారం అంతర్వేదిలో ఆ పార్టీ కమిటీ సమావేశం నల్లి బుజ్జిబాబు అధ్యక్షతన జరిగింది. కాగా నవంబర్ 22న సఖినేటిపల్లిలో నిర్వహించనున్న కౌలు రైతుల, ఎస్సీ సొసైటీల జిల్లా స్థాయి సదస్సుకు పార్టీ రాష్ట్ర నాయకులు హాజరవుతారని సమావేశం వెల్లడించింది. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్ర ప్రసాద్, రైతు సంఘ రాష్ట్ర నాయకుడు చెల్లుబోయిన కేశవశెట్టి, నాయకులు సీహెచ్ తాతారావు, దొండపాటి చిట్టిరాజు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల పేట తుళ్లి

ఆలమూరు: మండలంలోని చెముడులంక శివారు గాంధీనగరంలో అయ్యప్ప మాలధారులు బుధవారం పేట తుళ్లి నిర్వహించారు. అయ్యప్పస్వామి విగ్రహాన్ని పల్లకీలో ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. సన్నాయి వాయిద్య మేళాల మధ్య అయ్యప్ప స్వాములు రంగులు జల్లుకుని నృత్యాలు చేశారు. స్థానికంగా ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి పీఠానికి నాగిరెడ్డి నవీన్‌రాజా స్వామి అయ్యప్ప స్వామి వారి కంచు విగ్రహాన్ని బహూకరించారు. గురుస్వాములు తదితరులు పాల్గొన్నారు.

గుర్రాలక్క ఆలయ అభివృద్ధిపై సమీక్ష

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి అనుబంధ దేవాలయం గుర్రాలక్క అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులకై బుధవారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణతో సమీక్షించారు. అంతర్వేది దేవస్థానం కార్యాలయంలో ఈ మేరకు ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై ఎమ్మెల్యే వరప్రసాద్, ఏసీ సత్యనారాయణతో చర్చించారు. ఏపీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ గుండుబోగుల నరసింహారావు, స్థానిక ఎంపీటీసీ బైరా నాగరాజు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

50 శాతం పనులు మండల పరిషత్‌లకు కేటాయించాలి



అమలాపురంలో కలెక్టర్‌కు తమ డిమాండ్లు వివరిస్తున్న ఎంపీపీ

కొత్తపేట: ఉపాధి హామీ పథకం పనుల్లో 50 శాతం పనులను ప్రతిపాదించే అవకాశం మండల ప్రజా పరిషత్‌లకు కల్పించాలని కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు డిమాండ్ చేశారు. ఆ మేరకు అమలాపురం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి దిశ సమావేశంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్టు ఎంపీపీ బుధవారం సాయంత్రం స్థానిక విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపడుతున్న పనులకు సంబంధించి తీర్మానం చేసి ఇవ్వాల్సింది మండల పరిషత్ అయితే వాటిని ఎమ్మెల్యేలు ప్రతిపాదిస్తున్నారన్నారు. మండల పరిషత్ తీర్మానం లేకపోతే పనులు జరిగే అవకాశం లేదన్నారు. అందువల్ల 50 శాతం పనులు ప్రతిపాదించే అవకాశం, అధికారం మండల పరిషత్ పాలకవర్గానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల పరిషత్, పంచాయతీలకు సీనరేజ్, స్టాంప్ డ్యూటీ గ్రాంటు విడుదల చేయాలని కోరామన్నారు. పీహెచ్‌సీల నిర్వహణకు సంబంధించి ఏడాదికి ఇస్తున్న రూ 1.75 లక్షలను రూ 5 లక్షలకు పెంచాలని, పీహెచ్‌సీలకు నైట్‌వాచ్‌మన్‌లను నియమించాలని కోరినట్టు తెలిపారు. పై అంశాలతో కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించినట్టు ఆయన తెలిపారు.

ప్రొఫెసర్ సాయిబాబా ఆశయాలు కొనసాగిద్దాం

అయినవిల్లి: మానవహక్కుల పరిరక్షణ కోసం, ఆదివాసీల సంక్షేమం కోసం జీవితకాల పోరాటం చేసి అశువులు బాసిన ప్రొఫెసర్ జి.నాగసాయిబాబా అమరుడని ప్రొఫెసర్ జి.లక్ష్మణ్ పేర్కొన్నారు. బుధవారం అయినవిల్లి మండలం కె.జగన్నాథపురంలో సామాజిక సేవకుడు గంగుమళ్ళ శ్రీనివాస్ నివాసం వద్ద జరిగిన సభలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. అభిమానులు బంధుమిత్రులు ప్రజా సంఘాల సమైక్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీపీఐ నాయకులు కొప్పుల సత్తిబాబు అధ్యక్షత వహించగా ప్రొఫెసర్ జి.లక్ష్మణ్ ప్రొఫెసర్ జి.రామ్ దేవ్ (సాయిబాబా సోదరులు, తెలంగాణ) ముఖ్య వక్తలుగా పాల్గొని ప్రసంగించారు. 90% అంగవైకల్యం కలిగి చేయని నేరానికి ఆయన కుటుంబానికి విషాదమే మిగిల్చిందన్నారు. సాయిబాబా తమ్ముడు రాందేవ్ మాట్లాడుతూ సాయిబాబా జీవితం పట్టుదల, కృషి, చైతన్యం ప్రజాసంఘాల కార్యకర్తలకు దిశానిర్దేశం కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర హక్కుల సంఘం అధ్యక్షులు అమలదాసు బాబురావు ప్రజా సంఘాల నాయకులు బొంతు రమణ,దళిత సంఘాల నాయకులు గిడ్ల వెంకటేశ్వరరావు, వామపక్షాల నాయకులు మచ్చా నాగయ్య, అధ్యాపకులు గెల్లా వెంటేష్, అయినవిల్లి లంక సర్పంచ్ కుమ్మరి మాధవి రమణ, సిరిపల్లి మాజీ సర్పంచ్ బొక్కా రామచంద్ర రావు, బొంతు రాజేంద్రప్రసాద్, సరెళ్ళ దాసు, మాజీ ఎంపీటీసీ కోటిపల్లి ఓం సద్గురు ప్రసాద్, దాకారపు సత్యనారాయణ,గోకర కొండ గంగాచలం బంధుమిత్రులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్ అభివృద్ధికి చర్యలు



పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేది-పల్లిపాలెం గ్రామంలో ఉన్న ఫిషింగ్ హార్బర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. హార్బర్‌ను బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించిన దేవ వరప్రసాద్ స్థానిక మత్స్యకారులతో మాట్లాడి వారి ఇబ్బందులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. హార్బర్‌లో కనీసం విద్యుత్ సదుపాయం కానీ మంచి నీటి సౌకర్యం కానీ లేదని ఇతర సముద్రతీర ప్రాంతాల నుంచి దాదాపు 400 చేపల బోట్లు ఇక్కడికి వస్తాయని స్థానికులు ఎమ్మెల్యేతో అన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలో వీటికి పరిష్కార మార్గాలను చూపుతానని మత్స్యకారులకి భరోసా ఇచ్చారు. అలాగే సఖినేటిపల్లి మండల గొంది గ్రామ పరిధిలో ఉన్న వశిష్ట ఎడమ ఏటిగట్టు గొంది అవుట్ ఫాల్ స్లూయిస్‌ను కూడా పరిశీలించిన ఎమ్మెల్యే దేవ గేట్ల పనితీరు పై ఆరా తీశారు. స్లూయిస్ పనితీరులో ఏవైనా లోపాలు ఉంటే సరిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ సిద్దార్థ వర్ధన్, ఇతర అధికారులతో పాటు ఎంపీపీ వీరా మల్లిబాబు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

అధ్వానంగా బాలికల హైస్కూల్ రహదారి



మురికికూపంలా మారిన కొత్తపేట గరల్స్ హైస్కూల్ రోడ్డు

కొత్తపేట: మండల కేంద్రం మేజర్ గ్రామ పంచాయతీ. ఈ గ్రామ పరిధిలో పలు రోడ్లు అధ్వానంగా మారాయి. అటువంటి వాటిలో జెడ్పీ బాలికోన్నత పాఠశాల రోడ్డు ఒకటి. గ్రామంలో పాట్టి శ్రీరాముల రోడ్డు నుంచి కౌశిక రోడ్డుకు వెళ్లే బాలికల హైస్కూల్ రోడ్డు వర్షాలు కురిసినప్పుడే కాదు, వర్షాలు కురవని రోజుల్లో కూడా నీరుతో నిండి ఉంటుంది. డ్రైన్ నీరు, పలు ఇళ్లల్లో వాకం నీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. దానికి తోడు రోడ్డు ప్రక్కనే పేరుకుపోయిన చెత్తా చెదారం, ఆ నీరు పందుల నివాసంతో కలగలిసిపోయి మురికికూపంలా మారింది. అనేక వీధుల నివాసితులు రాకపోకలకు ప్రధానమైన మార్గం ఇదే. జెడ్పీ బాలికోన్నత పాఠశాల బాలికలు, ఇదే ప్రాంతంలో ఒక ప్రైవేట్ హైస్కూల్ బాలలు ఈరోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తారు. అటువంటి ఈ రోడ్డును పట్టించుకునే నాథుడు లేడు. దాంతో అంటు వ్యాధులకు దగ్గర దారిగా మారిందని పలువురు ఆ ప్రాంత నివాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. అసలే ప్రస్తుతం సీజనల్ జ్వరాలు, విష జ్వరాలు, టైఫాయిడ్, డెంగీ వ్యాధులతో అనేక మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల పాలయ్యారు. ఇటువంటి పరిస్థితుల్లో పంచాయతీ వారు ఈ రోడ్డు పరిస్థితిని పరిశీలించి, ఈ రోడ్డులో అనారోగ్య వాతావరణాన్ని రూపు మాపి, ఆరోగ్యకర వాతావరణం నెలకొల్పాలని స్థానికులు కోరారు.

జాన్‌లింకన్ సేవలు నిరుపమానం



ఎంపీడీఓ జాన్ లింకన్‌కు మెమెంటో బహూకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తదితరులు

ఆలమూరు: విధి నిర్వహణలో విశేష సేవలందించి ఎందరో ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచిన ఆలమూరు ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ సేవలు నిరుపమానమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మాజీ మంత్రి కేఎస్ జవహర్ అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్‌లోని ఎస్‌జేఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఎంపీడీఓ జాన్ లింకన్ ఉద్యోగ విరమణ సభ జరిగింది. గత 30 ఏళ్లుగా పలు శాఖల్లో నిర్వహించిన విధులకు ఆయన వన్నె తెచ్చారన్నారు. అలాగే ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి అనేక మంది విద్యార్థులను ఐఏఎస్‌లుగా తీర్చిదిద్దిన ఘనత ఎంపీడీఓ జాన్‌లింకన్‌కే దక్కుతుందన్నారు. అనంతరం ఎంపీడీఓ జాన్ లింకన్ దంపతులకు దుశ్శాలువా, పూలమాలలు వేసి మెమెంటోతో సత్కరించారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, తమ్మన శ్రీనివాసు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి పలువురు అధికారులు పాల్గొన్నారు.

మా దారి.. అడ్డదారి

- ఆగని ఇసుక అక్రమ తవ్వకాలు
- రాజకీయనేతల అండదండలు పుష్కలం
- ఆమ్యామ్యాల మత్తులో అధికార యంత్రాంగం



పులిదిండిలో నిల్వ ఉంచిన ఇసుక

ఆత్రేయపురం: ఎవరెన్ని చెప్పినా.. ఏ అధికారి అడ్డుపెట్టినా మా దారి అడ్డదారి.. దీన్నెవరు అడ్డుకోలేరు.. అంటూ ఇసుక అక్రమ తవ్వకం దారులు బరితెగిస్తున్నారు. పట్టుకున్నారు.. వదిలేశారు. రాత్రుళ్లు రయ్‌రయ్.. ఏటిగట్లు ధ్వంసమతున్నాయని, నిబంధనలు పాటించడం లేదని ఇటీవల 'సాక్షి' పలు కథనాలను ప్రచురించింది. అధికారులూ స్పందించారు. వెంటనే అడ్డుకుంటామని హామీలు గుప్పించారు. కాని తవ్వకాలు ఆగిన దాఖలాలు లేవు. రాజకీయ నేతల అండదండలతో ఇసుక మాఫియా రాత్రిళ్లు జడలు విప్పి శాసిస్తోంది. వందల టన్నుల ఇసుక యథేచ్ఛగా తరలిపోతోంది. గౌతమీ, వశిష్ఠ గోదావరి సాక్షిగా ఇసుక వ్యాపారులు అడ్డదారిలో నిబంధనలకు విరుద్ధంగా హవా కొనసాగిస్తున్నారు. ఆత్రేయపురం మండల పరిధిలోని పులిదిండి, బొబ్బర్లంక, రాజవరం, పేరవరం, కట్టుంగ తదితర గ్రామాల్లో ఇసుక రీచ్‌ల్లో ట్రాక్టర్లతో ఎగుమతులు చేసి వశిష్టా, గౌతమీ ఏటిగట్లపై ఇసుకను నిల్వ చేసి రాత్రిళ్లు ఇసుక లారీలతో బ్యారేజీల తూట్లు పొడుస్తూ ఇసుక అక్రమదారులు దందా సాగిస్తున్నారని విమర్శిస్తున్నారు. ఇదే అదనుగా భావించి.. అడ్డగోలుగా ఇసుకను తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. పలు గ్రామాల వద్ద ఇష్టానుసారంగా ఏటిగట్లను ఛిద్రం చేసి ర్యాంపుల ఏర్పాటు చేస్తుండడంతో రూ.కోట్లతో ఆధునీకరించిన ఏటిగట్లు ధ్వంసమవుతున్నాయి. మండలంలోని బొబ్బర్లంక, వెలిచేరు, పేరవరం, రాజవరం, తాడిపూడి, వసంతవాడ, నార్కెడిమిల్లి తదితర గ్రామాల్లో గౌతమీ, వశిష్ఠ ఏటిగట్లకు తూట్లు పొడుస్తూ అక్రమార్కులు ర్యాంపులు ఏర్పాటు చేశారు. మైన్స్, ఇరిగేషన్, రెవెన్యూ హెడ్‌వర్క్స్', పోలీసు అధికారుల సమన్వయంతో ఇసుక అక్రమాలను అడ్డుకోకపోతే ఆ ప్రభావం ధవళేశ్వరం బ్యారేజీ, లొల్లలాకులకు ప్రమాదం పొంచి ఉందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు అనధికార తవ్వకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

అధ్వానంగా వసతి గృహాలకు వెళ్లే రోడ్డు

మామిడికుదురు: మండల కేంద్రం మామిడికుదురులోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలకు వెళ్లే రోడ్డు పాడైపోయింది. గ్రావెల్ రోడ్డుపై ఏర్పడిన గోతుల్లో వర్షం నీరు నిలిచిపోయి విద్యార్థులు, పేరెంట్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాలుర వసతి గృహంలో 97 మంది బాలికల హాస్టల్‌లో 77 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ రోడ్డు పొడవు సుమారు 300 మీటర్లు విస్తీర్ణం ఉంటుంది. దీంతో పాటు బాలుర హాస్టల్ పక్కన విపరీతంగా డొంకలు, తుప్పలు పెరిగిపోయాయి. తుప్పలు, డొంకల్ని తొలగించడంతో పాటు గ్రావెల్ రోడ్డు స్థానే పక్కా రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పేరెంట్స్ కోరుతున్నారు. ఆ దిశగా అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నారు.



మామిడికుదురులో అధ్వానంగా మారిన హాస్టల్ రోడ్డు

కన్నులపండువగా అష్టోత్తర పూజలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుదవారం స్వామి వారి అష్టోత్తర పూజలు ఆలయ అర్చకులు కన్నులపండువగా నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఈఓ నల్లం సూర్య చక్రధరరావు పర్యవేక్షించారు.